# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 03-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ను పరామర్శించించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి.**

3. **రాష్ట్రంలో కాలువల నిర్వహణ, పూడికతీత పనులకు ప్రభుత్వం 397 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు వెల్లడించిన ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

4. **నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని 'జలధార--జలహారతి' పథకంలో భాగంగా హనుమంతునిగుండం చెరువులో పూడికతీత పనులను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి.**

5. **రాష్ట్రంలోని సంచార జాతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత.**

=========================

శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఉపముఖ్యమంత్రి నివాసానికి ముఖ్యమంత్రి నిన్న చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ చేసినట్లు పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రికి వివరించారు.

--------------------------

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదులో ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పీఆర్సీ నివేదికను త్వరగా అందించాలని అధికారులకు ఆదేశించారు. వచ్చే 100 రోజుల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6 వేల కోట్ల రూపాయలను చెల్లించనున్నట్టు ప్రకటించారు. వచ్చే నెల 1వ తేదీలోగా ఆరోగ్య భద్రత కార్డులు అందిస్తామని, ఇతర అంశాలపైన సానుకూలంగా స్పందిస్తామని చెప్పారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని, రెండు సంవత్సరాల్లో 67 వేల 760 ఉద్యోగ నియామకాలు చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో కాలువల నిర్వహణ, పూడికతీత పనులకు ప్రభుత్వం 397 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో క్యాంపు కార్యాలయంలో ఆయన నిన్న మాట్లాడుతూ.. గడచిన 20 నెలల్లో కాలువల నిర్వహణ పనులకు 11 వందల కోట్ల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు. తాజాగా విడుదల చేసిన నిధులతో తూడు, గుర్రపుడెక్క తొలగింపు, నీటి అడ్డంకుల నివారణ, కాలువల పూడికతీత వంటి పనులు చేపడతామన్నారు. ఈ పనులను వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ముందే పూర్తి చేస్తామని మంత్రి పేర్కొంటూ...

వాయిస్.. 34

---------------------------

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని 'జలధార--జలహారతి' పథకంలో భాగంగా హనుమంతునిగుండం చెరువులో పూడికతీత పనులను ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూగర్భ జలమట్టాన్ని కనీసం 3 మీటర్లు పెంచడం లక్ష్యమని తెలిపారు. చెరువుల పూడిక మట్టి తొలగించంతో వందల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ పనులు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొంటూ..

వాయిస్.. 24

---------------------------

వెనుకబడిన వర్గాల సమగ్ర సర్వేను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సూచించారు. విశాఖపట్నం జిల్లా కేంద్రంలోని జివిఎంసి కార్యాలయంలో నిన్న నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వెనుబడిన వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని ఎటువంటి తారతమ్యం లేకుండా సేకరించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల వారీగా జనాభా వివరాలు, ఉపకులాల సమాచారం సేకరించి భవిష్యత్ రిజర్వేషన్ల అమలుకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనగణనలో వెనుకబడిన వర్గాలకు సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని సంచార జాతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సంచార జాతుల ప్రతినిధులతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంచారజాతులకు గుర్తింపు కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంచార జాతుల అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, ఇళ్ల నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

---------------------------

మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ-వెరిఫికేషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కె.వి. శ్రీనివాసులు రెడ్డి

తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు విద్యార్థులు తమ పాఠశాల లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు 500 రూపాయలు, రీ-వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. చెల్లింపులు అధికారిక వెబ్‌సైట్ లో లేక ఆన్‌లైన్‌లో మాత్రమే చేయాలని పేర్కొన్నారు.

-----------------------------

వైద్య విద్య కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-నీట్ ఈ రోజు జరగనుంది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ పరీక్షకు నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ అవసరమైన అన్నిఏర్పాటు చేసింది. ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్రంలో సుమారు 70వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 28 పట్టణాల్లో సుమారు 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే హాజరు కావాలని ఎన్టిఎ తెలిపింది.

-----------------------------

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతున్నాయి. ఉత్తర-దక్షిణ ద్రోణి పశ్చిమ రాజస్థాన్ పై గల ఉపరితల ఆవర్తనం నుంచి తూర్పు రాజస్థాన్, తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడుల మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్నదని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ఒడిశా నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తమిళనాడుల మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ఉన్న మరో ద్రోణి బలహీనపడిందని వాతావరణ కేంద్ర అధికారి నారాయణ పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాం ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..25

మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

=====================